క్లుప్తంగా

ఐటీఐలో వాక్ ఇన్ అడ్మిషన్

కాటారం: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సీట్ల భర్తీ కోసం ఆదివారం నుంచి వాక్ ఇన్ అడ్మిషన్ దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో పలు విభాగాల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం వాక్ ఇన్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అడ్మిషన్ పొందే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్‌తో కళాశాలలో హాజరుకావాలని సూచించారు. ఈ నెల 9 వరకు అవకాశం ఉన్నట్లు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

మహదేవపూర్: మండల కేంద్రంలో జిల్లా స్థాయి రేషన్ డీలర్ల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ పాల్గొని మాట్లాడుతూ తమ రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, మండల అధ్యక్షుడు కొండయ్య, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



మల్హర్: భారీ వర్షాలకు దెబ్బతిన్న తాడిచర్ల-కొయ్యూరు నాగులమ్మ డబుల్ రోడ్డుకు ఆర్ అండ్‌బీ అధికారులు మరమ్మతు చేపడుతున్నారు. జెన్‌కో ద్వారా రూ.కోటి మంజూరైన విషయం తెలిసిందే. కాగా పెద్దతూండ్ల ఇప్పల్ల క్రాస్ నుంచి తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం వరకు గుంతలు పడినచోట జేసీబీ సాయంతో తొలగించి, కంకర నింపి చదును చేస్తున్నారు. అనంతరం డాంబర్‌తో ప్యాచ్ వరకు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కోరం లేక సభ వాయిదా

చిట్యాల: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కోరం లేక మండల సభ వాయిదా వేసినట్లు ఎంపీపీ దావు వినోద తెలిపారు. మళ్లీ అక్టోబర్ మొదటి వారంలో మండల సభ నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీడీఓ రామయ్య, వివిధ శాఖలకు చెందిన మండల అధికారులు పాల్గొన్నారు.

మల్హర్: పీఏసీఎస్ మండల సర్వ సభ్య సమావేశం వాయిదా పడినట్లు సీఈఓ సంతోష్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం మండలంలోని తాడిచర్ల సహకార కార్యాలయంలో నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి చైర్మన్, డైరెక్టర్లు మినహా రైతులు హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. త్వరలోనే సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మొగుళ్లపల్లి: ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఆశ వర్కర్లు చేస్తున్న సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుమారస్వామి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ లింగారావు, టౌన్ అధ్యక్షుడు రమేష్, మండల ప్రధాన కార్యదర్శి రాము, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె



కాటారం: తమ సమస్యలు, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కా ర్మికులు సమ్మె చేపట్టారు. మధ్యాహ్న భోజన కార్మి కులు మాట్లాడుతూ ప్రస్తుతం పొందుతున్న వేతనంపై రూ.2 వేలు అదనంగా ప్రకటిస్తూ సీఎం కేసీఆర్ జీఓ 8 విడుదల చేశారని పెరిగిన జీతం ఇంతవరకు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు చీర్ల పద్మ, గొని స్వరూప, మధునమ్మ, పుష్ప, లావణ్య, మధునక్క పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రావు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జీఎం, అధికారులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో పని చేస్తున్న మైనింగ్ సర్దార్లు, ఓవర్‌మెన్, ఫోర్‌మెన్లు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రావు సూచించారు. ఏరియాలోని వీటీసీ కార్యాలయంలో నిర్వహించిన ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 12 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి 5 ఏళ్లకు ఒకసారి మైనింగ్ సర్దార్, ఓవర్‌మెన్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌లకు నైపుణ్యతను పెంపొందించుటకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వెంకటయ్య, తు కారాం, రామన్‌పాలక్, చందర్‌రావు, ఆంజనేయులు, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛత పక్వాడను విజయవంతం చేయాలి

ఈనెల 1 నుంచి 31 వరకు నిర్వహించనున్న స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 3.0 సింగరేణి వ్యాప్తంగా విజయవంతం చేయాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డిలు ఏరియా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఏరియా సింగరేణి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఏరియాలోని అన్ని కార్యాలయాలు శుభ్రం చేసి సుందరీకరించి, చెత్తను పడవేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో ఏరియా జీఎం శ్రీనివాసరావు, వెంకటయ్య, తుకారాం, కృష్ణప్రసాద్, బాలరాజు, క్రాంతికుమార్‌లు పాల్గొన్నారు.

సంక్షేమాధికారులతో సమీక్ష

ఏరియాలోని పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలపై పర్సనల్ డీజీఎం తుకారాం ఏరియాలోని అన్ని గనుల సంక్షేమ అధికారులతో సమీక్ష నిర్వహించారు. టైమ్ రేటెడ్ ప్రమోషన్లు, టర్మినల్ బెనిఫిట్స్, కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేయాలన్నారు. అర్హులైన వారిని గుర్తించాలని సూచించారు. పనులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు రాజు, క్రాంతికుమార్, శ్యామ్‌ప్రసాద్‌లు పాల్గొన్నారు.

అసైన్డ్ పట్టాలు మాకొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమన్

చిట్యాల: అసైన్డ్ పట్టాలు మాకొద్దని, మాకు పాత పట్టా పాసుబుక్ లతో రిజిస్ట్రేషన్ చేసుకునే వి ధంగా పట్టాలు ఇవ్వాలని మండలంలోని నైన్‌పాక, వరికోల్‌పల్లికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. శనివారం నైన్‌పాక రైతు వేదికలో తహసీల్దార్ సుమన్ రైతులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ శివారులోని సర్వేనంబర్ 440, 443లలో ఇటీవల కొలతలు చేపట్టగా భూమి ఎక్కువగా తెలిసిందని అన్నారు. పంటలు సాగు చేసుకుంటున్న రైతులకు లావణి పట్టాలు మాత్రమే పంపిణీ చేస్తామని తెలిపారు. దీంతో వరికోల్‌పల్లి, నైన్‌పాక, కుమ్మరిపల్లె గ్రామాలకు చెందిన రైతులు 60 ఏళ్లక్రితం సర్వే నంబర్ 440, 443 గల భూమిని కొనుగోలు చేసిన భూమిలో పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. మాకు గతంలో ఉన్న ప్రభుత్వాలు పట్టాపాస్ పుస్తకాలతో ఇచ్చారని,అసైన్డ్‌మెంట్ పట్టాలు ఇస్తామని అధికారులు తెలపడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను కాదని అసైన్డ్‌మెంట్ పట్టాలు ఎలా ఇస్తారని తహసీల్దార్‌ను నిలదీశారు. దీంతో జిల్లా ఉన్నత అధికారులకు సమాచారం అందిస్తానని అన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్రె సాగర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



కాటారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో స్థానిక కేంబ్రిడ్జి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అండర్-14, 17 బాలికల విభాగంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖోలో మొదటి స్థానం, బాలుర విభాగంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయా విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వరుణ్, సృజన్, నిఖిల్, అంజన్న, మణికంఠ, హర్షిత, మల్లిక, కావ్య, వర్షిత, అంజలిని కరస్పాండెంట్ తాటి శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాల్ పృథ్వీ అభినందించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చిట్యాల: మల్లయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీటీసీ సాగర్



కాటారం: ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చిట్యాల: మండలంలోని కైలాపూర్‌కు చెందిన చుంచు రాజమల్లు, చల్లగరిగ గ్రామానికి చెందిన గొల్లపల్లి మల్లయ్య, ఒడితలకు చెందిన మ్యాదరి ముత్తయ్య, జడల్‌పేటకు చెందిన భోజ రవీందర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ గొర్రె సాగర్ శనివారం పరామర్శించి వారి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం

కాటారం: మండలంలోని ప్రతాపగిరిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వంగళ నారాయణ కుటుంబానికి ప్రతాపరుద్ర వెల్ఫేర్ ఫౌండేషన్, మండల స్వర్ణకారుల సంఘం, ఆల్ ఇండియా శ్రీవిరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ చేయూతనందించింది. ఫౌండేషన్, సంఘాల నాయకులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. రూ.2వేలు ఆర్థిక సహాయంతో పాటు 25కిలోల బియ్యం, సంఘాల ఆధ్వర్యంలో ఆర్థికసాయం, బియ్యం అందజేశారు. ప్రతాపరుద్ర వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మెండ మల్లయ్య, సలహాదారుడు వేముల సమ్మయ్య, ఏఐవీఎఫ్ మండల కన్వీనర్ వంగళ దేవేంద్రాచారి, వంగళ జనార్దన్, బోనాల రమేశ్‌చారి, ఉపేందర్, వెంకటేశ్వర్లు, భీష్మాచారి, బాపు, శ్రీనివాస్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బాలింతలు జాగ్రత్తలు తీసుకోవాలి



చిట్యాల: బాలింతలు తమ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద అన్నారు. శనివారం స్థానిక సివిల్ ఆస్పత్రిలో డెలివరీ అయిన ఇద్దరు బాలింతలను కలిసి వారికి తగు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలింతలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. పుట్టిన పిల్లలకు ముర్రుపాలు తాగించాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చింతల సంధ్యారాణి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ పరిశీలన



మహాముత్తారం: మండలంలోని మీనాజీపేటలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం శనివారం పరిశీలించింది. ఎన్‌క్యూ ఏఎస్ బృందం సభ్యులు డాక్టర్ సబీర్‌పటేల్, అమిత్‌కుమార్ పరిశీలించారు. సెంటర్‌లోని రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందిని ప్రజలకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట డీఎంహెచ్‌ఓ శ్రీరాం, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారులు డాక్టర్ శ్రీదేవి, ఉమాదేవి, అన్వేషిని, జిల్లా క్వాలిటి మేనేజర్ డాక్టర్ బానుకుమార్, స్థానిక వైద్యాధికారి సందీప్, డీపీఓ చిరంజీవి, జిల్లా ఎపిడమిస్టు బాష్యనాయక్, డీడీఎంలు మధుబాబు, ప్రభాకర్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



వంట గదిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

కాటారం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఆయన తనిఖీ చేశారు. కళాశాల, పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాలలో సౌకర్యాలు, పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు, విద్యాబోధన, భోజనం గూర్చి అడిగి తెలుసుకున్నారు. కిచెన్, వంట సామగ్రిని పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించాలని వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. నిత్యం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలని తెలిపారు. ఎంపీడీఓ వెంట ప్రిన్సిపాల్ బుచ్చయ్య,పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్, తదితరులు ఉన్నారు.

గండ్ర యువసేన మండల కమిటీ నియామకం



రజనీకాంత్ అధ్యక్షుడు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల గండ్ర యువసేన మండల కమిటీని శనివారం నియోజకవర్గ అధ్యక్షుడు కరాటే శ్రీను ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దమ్మన్నపేటకు చెందిన గంజి రజినీకాంత్, ప్రధాన కార్యదర్శి సాదు నగేష్ (కనిపర్తి), ఉపాధ్యక్షులు ఎడ్ల అనూష్‌రెడ్డి(రేగొండ), కొడెపాక అరుణ్(పెద్దంపల్లి), జూపాక రమేష్ (జూబ్లీనగర్), ప్రచార కార్యదర్శి దాట్ల రాజేందర్, కోశాధికారి యాకూబ్‌పాషా(కనిపర్తి), కార్యవర్గ సభ్యులు భోగి నరేష్ , మైస సృజన్, మైన నాగేంద్ర, గంజి నరేష్, లింగంపెల్లి రాజురావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ బీఆర్ఎస్ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ, రానున్న ఎన్నికల్లో గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. నాపై నమ్మకంతో గండ్ర యువసేన మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే గండ్రకు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, నియోజకవర్గ అధ్యక్షుడు కరాటే శ్రీనుకు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్లకు వాక్ ఇన్ ప్రవేశాల ప్రక్రియ చేపడుతున్నట్లు స్థానిక ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ జగన్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 8లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని 9లోపు సంబంధిత కళాశాలల్లో విద్యార్హత ధృవీకరణ పత్రాలను కళాశాలలో అందజేయాలని సూచించారు.

రేషనలైజేషన్ విధానం మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొమురయ్య

భూపాలపల్లి అర్బన్: వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాల నియామకాలు చేపట్టకుండా ఉన్నటువంటి ఉద్యోగులను సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్న రేషనలైజేషన్ విధానాన్ని మానుకోవాలని వైద్యారోగ్యశాఖ ఉద్యోగుల జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ కొమురయ్య, స్వామి, రాజయ్య డిమాండ్ చేశారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 142ను తీసుకొచ్చి ఉద్యోగులను సర్దుబాటు చేయాలని చూస్తుందన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు. రేషనలైజేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4 ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలని, ఉద్యోగుల సంఖ్యను కుదించి వైద్యాన్ని ప్రజలకు దూరం చేయాలని కుట్ర పన్నుతున్నట్లు ఆరోపించారు. ఈ నెల 5న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జేఏసీ నాయకులు వెంకటమ్మ, శ్రీదేవి, కావ్య, విజయ, పరమేశ్వర్, గోపి, సతీష్, వేణులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందిస్తున్న తోటి ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: మండలంలోని మహాత్మా జ్యోతిబా గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో, అసోసియేషన్ చాంపియన్ గేమ్స్‌లలో చక్కటి ప్రతిభను చూపి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ అలుబోజు వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో అండర్-17,14 లలో మొదటి బహుమతి గెలుపొందడంతో పాటు ముగ్గురు విద్యార్థులు సిద్ధూ, శ్రీశాంత్, శ్రీకాంత్, జీవన్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. అసోసియేషన్ గేమ్స్‌లో కార్తీక్, అక్షిత్, వివేక్ తేజ్‌లు డిస్కస్, జావాలిన్ లలో ప్రథమ, ద్వితీయ బహుమతులను సాధించారని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. క్రీడారంగంలో ఎంతో మంది తమ ప్రతిభను చూపి ప్రపంచం గర్వించే స్థాయిలో ఉన్నారని వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, కార్తీక్‌లను ప్రిన్సిపాల్, ఏటీపీలు రాజేందర్, పాపారావు, తదితరులు అభినందించారు.

అనారోగ్యానికి గురైన అన్నా,చెల్లెలు

- చికిత్స పొందుతున్న అన్న మృతి
- కుందనపల్లిలో విషాదం



కాన్షీసామ్రాట్ (ఫైల్)

టేకుమట్ల: ఇంట్లో ఆడుతూ, పాడుతూ సందడి చేసే చిన్నారుల ఇంట్లో చీకటి అలుముకుంది. ఇటీవల ఒకేసారి అన్నాచెల్లెలు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అన్న మృతి చెందగా, చెల్లి మాయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన మండలంలోని కుందనపల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కుందనపల్లికి చెందిన మాదుగుల వెంకటేష్-స్వప్న దంపతులకు బాబు కాన్షీసామ్రాట్(3), పాప మాయ ఉన్నారు. పిల్లలే లోకంగా బతుకుతున్న వారి జీవితాల్లో ఫిట్స్ రూపంలో ఇద్దరు పిల్లలు ఒకేసారి అనారోగ్యానికి గురి కావడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. రెక్కాడితే డొక్కాడని కుటుంబానికి అండగా దాతలు నిలువడంతో హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మెదడువాపు లక్షణాలతో కాన్షీసామ్రాట్ శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాన్షీరాం వారసుడు అవుతా డని అనుకున్నా కానీ మమ్ములను వదిలి వెళ్లిపోయావా బిడ్డా అంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించాయి. ఒకవైపు కొడుకు మృతితో పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులకు మరో వైపు చికిత్స పొందుతున్న ఐదు నెలల పాప మాయ ఆరోగ్యంపై తీవ్ర మనోవేదనతో తల్లడిల్లుతున్నారు.

గ్యారంటీ పథకాలపై కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం



గుర్రంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

భూపాలపల్లిరూరల్: ములుగు నియోజక వర్గంలోని భూపాలపల్లి మండలం గుర్రంపేటలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ పథకాలను ప్రచారం చేశారు. కార్యక్రమానికి ములుగు జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కోడూరి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు గుర్రంపేట, రంనాయక్ తండా గ్రామ, యూత్ కమిటీల ఆధ్వర్యంలో సీతక్క భారీ మెజార్టీతో గెలవాలని, గ్రామంలోని సమ్మక్క సారలమ్మలకు పూజలు నిర్వహించి ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పోరిక సమ్మయ్య, సీనియర్ నాయకులు అజ్మీర సూరనాయక్, ఉస్మాన్ పటేల్, మాజీ సర్పంచ్ రాపర్తి రాజ మొగిలి, సారయ్య, సారయ్య, కార్యకర్తలు రామచందర్, చిరంజీవి, భాస్కర్, దేవేందర్, సది, శ్రీను , రాజు, రెడ్డి సమ్మయ్య, సురేష్,కొర్ర సమ్మయ్య, అమ్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం చేరిన ప్రజా ఆశీర్వాద పాదయాత్ర



పాదయాత్రలో పుట్ట మధు, ప్రజలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరానికి మంథని బీఆర్ఎస్ అభ్యర్థి, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు నిర్వస్తున్న 'ప్రజా ఆశీర్వాద పాదయాత్ర' శనివారం రాత్రి కాళేశ్వరానికి చేరుకుంది. కాగా, రాత్రి అంతర్రాష్ట్ర వంతెన మూలమలుపు వద్ద ఓ వెంచర్ ఖాళీ స్థలంలో ఆయన బస చేయనున్నా రు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లోని కాళేశ్వరం వద్ద రాత్రి పూట బసచేయడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం కాళేశ్వరం, మెట్‌పల్లి(కన్నెపల్లి), పూస్కుపల్లి, మద్దులపల్లి, నాగేపల్లి, చంద్రుపల్లి, అన్నారం వరకు పాదయాత్ర సాగనుంది. వారి వెంట జిల్లా జెడ్పీచైర్ పర్సన్ శ్రీహర్షిణి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సర్పంచ్ వసంత, ఎంపీటీసీ మమత, తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

పాఠశాలకు వెళ్లి అనంతలోకాలకు.. రోడ్డు ప్రమాదంలో ఎల్‌కేజీ విద్యార్థి మృతి



సాహిత్ (ఫైల్)

గణపురం : నవమాసాలు మోసి.. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న తమ కుమారుడు కళ్లెదుటే మృత్యుఒడికి చేరాడు. భవిష్యత్ కోసం ఉన్నత శిఖరాల్లో తన కొడుకును చూడాలన్న తన కల తన చేతిలో ఉండగానే రోడ్డు ప్రమాదం రూపంలో నీరుగారిపోయిన ఘటన మండలంలోని గాంధీనగర్‌లో జరిగింది. గాంధీనగర్‌కు చెందిన వెంపటి పద్మ-భువనసుందర్ దంపతుల కుమారుడు సాహిత్(5) స్థానిక సీఎస్ఐ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన సాహిత్‌ను సాయంత్రం పాఠశాల నుంచి తల్లి పద్మ ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో గణపురం నుంచి గాంధీనగర్ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనంపై అతివేగంగా ఢీ కొట్టాడు. దీంతో సాహిత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం హన్మకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. ఒకరి దుర్మరణం



రవీందర్ (ఫైల్)

కాటారం : మండలంలోని మేడిపల్లిలోని జాతీయ రహదారిపై ఇసుక లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. మల్హర్ మండలం నాచారం గ్రామానికి చెందిన చింతలపల్లి రవీందర్(35) మహాముత్తారం మండలం జీలపల్లిలో మూడు రోజుల క్రితం గేదెలు కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో రవీందర్ శనివారం తన తండ్రి సంపత్‌రావుతో కలిసి గేదెలను ట్రాలీలో ఎక్కించడానికి జీలపల్లికి వెళ్లి పని ముగించుకొని తండ్రి కొడుకులు వేర్వేరు ద్విచక్ర వాహనాలపై భూపాలపల్లి వైపు తిరుగు పయనమయ్యారు. మేడిపల్లి అటవీ ప్రాంతంలో కమలాపూర్ క్రాస్ సమీపంలో అతివేగంతో కాటారం వైపునకు వస్తున్న ఇసుక లారీ.. రవీందర్ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో రవీందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకొన్న ఎస్సై ప్రమాదాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్యతో పాటు ఎనిమిది నెలల కుమారుడు ఉన్నారు. అనంతరం మృతుడి తండ్రి సంపత్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సినీ ఫక్కీలో చోరీ

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ పాత గ్రామ పంచాయతీ సమీపంలో ఓ కిరాణం షాపులో సినీ ఫక్కీలో దొంగతనం జరిగిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నరిగ సమ్మయ్య కిరాణంలో అతని భార్య నరిగ అరుణ కిరాణం దుకాణంలో ఉంది. శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వస్తువుల కొనుగోలు కోసం వచ్చినట్లు వచ్చి అరుణ మెడలోని పుస్తెల తాడును లాకెళ్లకుపోయాడు. స్థానికులు గమనించి ద్విచక్ర వాహనంపై వెంబడించగా రెడ్డి కాలనీ వాటర్ ట్యాంక్ సమీపంలో బంగారు గొలుసును వదిలి పారిపోయాడు. ఈ విషయమై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శనివారం పోలీసులు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కాశీంపల్లి గ్రామానికి చెందిన ఆవుల యశ్వంత్ పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు.